మూసీలో భారీ స్కామ్

- సుందరీకరణ పేరిట కుంభకోణం
- పాకిస్థానీ కంపెనీలకు కట్టబెట్టే ప్రయత్నం
- అన్ని వివరాలు త్వరలో వెల్లడి
- జీహెచ్ఎంసీలో మొత్తం 31 ఎస్టీపీలు మేమే నిర్మించాం
- సీఎం చేయాల్సిందల్లా గ్యారెంటీల అమలే
- కూకట్‌పల్లిలో మురుగునీటి శుద్ధి కేంద్రం, ఖాజాకుంట ఎస్టీపీని పరిశీలించిన కేటీఆర్
- 11.86 ఎకరాల్లో 171.57 కోట్ల నిధులతో బీఆర్ఎస్ హయాంలోనే నిర్మాణం

కూకట్‌పల్లి ఫతేనగర్‌లోని ఎస్టీపీ వద్ద శుద్ధి చేసిన నీటిని చూపుతున్న కేటీఆర్

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): మూసీ నది సుందరీకరణ పేరుతో రూ.వేల కోట్ల కుంభకోణం జరుగుతున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ఆరోపించారు. మూసీ సుందరీకరణ పనులను పాకిస్థాన్ కంపెనీలకు కట్టబెట్టేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని, బ్లాక్‌లిస్టులో ఉన్న కంపెనీకి అప్పగించాలని చూస్తున్నారని మండిపడ్డారు. త్వరలోనే అన్ని వివరాలు బయటపెడతానని హెచ్చరించారు. బుధవారం ఆయన కూకట్‌పల్లి నియోజకవర్గం ఫతేనగర్ డివిజన్ పరిధిలోని ఎల్బీఎస్‌నగర్‌లో జలమండలి నిర్మించిన మురుగునీటి శుద్ధి కేంద్రం, కూకట్‌పల్లి ఖాజాకుంటలో నిర్మించిన మరో ఎస్టీపీని పరిశీలించారు. బీఆర్ఎస్ హయాంలో 11.86 ఎకరాల స్థలంలో రూ.171.57 కోట్ల నిధులతో 133 ఎంఎల్‌డీ సామర్థ్యంతో జలమండలి ఆధ్వర్యంలో ఈ మురుగునీటి శుద్ధి కేంద్రం నిర్మాణం చేపట్టడం విశేషం. కార్యక్రమంలో మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, మహమూద్‌అలీ, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, మాగంటి గోపీనాథ్, మర్రి రాజశేఖర్‌రెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, జలమండలి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన ఎస్టీపీలను వినియోగించుకుంటే సరిపోతుందని స్పష్టంచేశారు. తమ ప్రభుత్వం రూ.4 వేల కోట్లతో జీహెచ్ఎంసీ పరిధిలో 31 ఎస్టీపీలు నిర్మించిందని చెప్పారు. మూసీ ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి, మంత్రుల మాటలకు పొంతన లేదని దుయ్యబట్టారు. మూసీ సుందరీకరణ కోసం 1.50 కోట్లు ఖర్చు పెడుతున్నట్టు ఒకసారి, రూ.50 వేల కోట్లు అని మరోసారి, రూ.75 వేల కోట్లు అని ఇంకోసారి ఇలా రకరకాలుగా మంత్రులు పొంతనలేని ప్రకటనలు చేయడం వెనుక అస లు ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు. మంత్రుల మాటలు చూస్తుంటే పలు అనుమానాలు తలెత్తున్నాయని చెప్పారు. మూసీ శుద్ధి వెనుక ప్రభుత్వ అసలు ఉద్దేశం వేరే ఉన్నదా? అనే అనుమానం ప్రజల్లో కలుగుతున్నదని పేర్కొన్నారు. ఎస్టీపీల్లో శుద్ధి చేసిన నీరు మూసీలోకి వెళ్తుందని, 94% స్వచ్ఛమైన నీరు వెళ్తున్నప్పుడు మూసీ శుద్ధి ఎందుకు? అని ప్రశ్నించారు. కొత్తగా శుద్ధి చేసేదేమీలేదని తెలిపారు. మూసీ నిర్వాసితులకు ముందుగానే నష్టపరిహారం చెల్లించాలని, డబుల్ బెడ్‌రూం ఇంటి తాళాలు అప్పగించి కూల్చివేతలు చేపట్టాలని, లేనిపక్షంలో మూసీ వద్ద కూల్చివేతలను బీఆర్ఎస్ అడ్డుకుంటుందని హెచ్చరించారు.

ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. గ్యారెంటీలు అమలు పరిచేదాకా ప్రజల పక్షాన నిలబడతామని స్పష్టంచేశారు. ఆరు గ్యారెంటీల్లో భాగంగా హామీ ఇచ్చిన రూ.4 వేల పింఛన్, తులం బంగారం, మహిళలకు నెలకు రూ.2,500 వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. రైతు రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలుచేయాలని, వానకాలం రైతుభరోసాను రైతుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. పబ్లిసిటీ స్టంట్ల మాయ ఎక్కువ రోజులు పనిచేయదని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన శ్మశానవాటికలు, లింక్‌రోడ్లు, ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, లైబ్రరీలు, కమ్యూనిటీ హాల్స్, పార్కులు, మురుగునీరు శుద్ధి కేంద్రాలను చూసి ప్రజలు ప్రశంసలు కురిపించారని తెలిపారు. కూకట్‌పల్లిలో ఎస్టీపీల నిర్మాణం కోసం రూ.300 కోట్లు కేటాయించగా నిధులు విడుదల చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఇండ్ల కూల్చివేతల విషయంలో ముఖ్యమంత్రి అన్నదమ్ములకు, ఎమ్మెల్యేలకు, మంత్రులకు ఒక న్యాయం, పేదలకు మరో న్యాయమా? అని కేటీఆర్ ప్రశ్నించారు. పేదల ఇండ్లు కూల్చడానికి బుల్డోజర్లు పెడతరు కానీ, పెద్దలకు పెట్టరా? అని ఆగ్రహం వ్యక్తంచేశారు. బుల్డోజర్ల బాధితులకు వెంటనే రెడీగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇండ్లను కేటాయించాలని డిమాండ్ చేశారు.

గత ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులు ప్రారంభానికి సిద్ధం

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన నాలుగు ప్రాజెక్టులు పనులు పూర్తి చేసుకొని ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని కేటీఆర్ తెలిపారు. పనులు పూర్తి చేసుకున్న ఫతేనగర్ ఎస్టీపీని ప్రారంభించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తున్నదని మండిపడ్డారు. ఫతేనగర్ బ్రిడ్జి కోసం రూ.60 కోట్లు కేటాయించి పనులు చేపట్టినా నిధులు విడుదల చేయని కారణంగా ఆ పనులు ముందుకు సాగడం లేదని తెలిపారు. తాము 14 వేల ఎకరాల స్థలాన్ని ఫార్మాసిటీకి కేటాయిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం దానిని రద్దు చేసి, ఫ్యూచర్ సిటీ ఏర్పాటుచేస్తామనడం శోచనీయమని పేర్కొన్నారు.

బహుజన అస్తిత్వ పతాక 'ఐలమ్మ'

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నివాళి

హైదరాబాద్, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రైతాంగ పోరాట యోధ, ఆత్మగౌరవ ప్రతీక, వీరనారి చిట్యాల ఐలమ్మ అందించిన పోరాట స్ఫూర్తిని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్మరించుకున్నారు. గురువారం ఐలమ్మ జయంతి సందర్భంగా ఆమె పోరాట స్ఫూర్తిని కేసీఆర్ నెమరువేసుకున్నారు. అణచివేతకు గురైన బలహీన వర్గాల తిరుగుబాటు తత్వానికి, ప్రతిఘటనా పోరాటానికి ఐలమ్మ స్ఫూర్తిగా నిలిచారని తెలిపారు. ఐలమ్మ ఆకాంక్షలకు అనుగుణంగానే పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం బడుగు, బలహీనవర్గాల కోసం సంక్షేమ, ప్రగతి కార్యాచరణను అమలు చేసిందని గుర్తుచేశారు. దేశంలో మరెక్కడాలేని విధంగా తెలంగాణ సబ్బండవర్గాలకు వేల కోట్లతో పలు పథకాలను అమలు చేసి వారిని గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిపిందని పేర్కొన్నారు. ప్రజావ్యతిరేక పాలనపై ధిక్కారాన్ని ప్రకటించిన ఐలమ్మ ప్రతిఘటనాతత్వం ఎల్లవేళలా ఆదర్శమని కేసీఆర్ తెలిపారు. ఐలమ్మ స్ఫూర్తిని భవిష్యత్తు తరాలకు అందించే దిశగా నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఆమె జయంతిని అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించి అమలు చేసిందన్నారు. బలహీన వర్గాలు, పేదల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేయటమే ఐలమ్మకు మనం అర్పించే ఘన నివాళి అని తెలిపారు.

నేడు పాడి రైతుల మహా ధర్నా

- ఇందిరాపార్క్ వద్ద భారీ ఆందోళనకు పిలుపు
- జిల్లాల నుంచి తరలిరానున్న వందల మంది పాడి రైతులు
- 150 కోట్ల పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్

హైదరాబాద్, సెప్టెంబర్ 25(నమస్తే తెలంగాణ): పాల బిల్లులు చెల్లించాలనే ప్రధాన డిమాండ్‌తో విజయ డెయిరీ పాడి రైతులు గురువారం హైదరాబాద్‌లో మహాధర్నాకు పిలుపునిచ్చారు. విజయ పాడి రైతుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో గురువారం ఉదయం ఇందిరాపార్క్ వద్ద ఈ భారీ ధర్నా నిర్వహించనున్నారు. ఈ ధర్నాకు రాష్ట్రం నలుమూలల నుంచి పాడి రైతులు భారీ సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నది. ఇప్పటికే ఆయా జిల్లాల్లో రైతులు సన్నాహక సమావేశాలను కూడా ఏర్పాటు చేసుకున్నారు. ఇప్పటికే పాడి రైతుల ధర్నాకు పోలీసులు అనుమతి ఇవ్వడంతో పెద్ద సంఖ్యలో రైతులు తరలివచ్చే అవకాశం ఉన్నది. అయితే ధర్నాకు వచ్చే పాడి రైతుల గురించి పోలీసులు ఆరా తీస్తున్నట్టు తెలిసింది. ఏ గ్రామం నుంచి ఎంతమంది వెళ్తున్నారు, ఎవరెవరు వెళ్తున్నారు? వంటి వివరాలను తెలుసుకుంటున్నట్టు తెలిసింది. విజయ డెయిరీ పాడి రైతులకు సుమారు మూడు నెలలుగా పాల బిల్లులు చెల్లించడం లేదు. ఇప్పటివరకు సుమారు రూ.150 కోట్ల వరకు పెండింగ్ బిల్లుల బకాయిలు పేరుకుపోయాయి. దీంతో బకాయిలు చెల్లించాలంటూ పాడి రైతులు రాష్ట్రవ్యాప్తంగా రోడెక్కారు. రోడ్లపై పాలు పారబోసి నిరసనలకు దిగారు. ప్రభుత్వ అధికారులకు, మంత్రులకు, ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు అందజేశారు. కానీ ప్రభుత్వం నుంచి బకాయిల చెల్లింపుపై కనీస స్పందన రాలేదు. ఈ విధంగా ఓవైపు ప్రభుత్వం పట్టించుకోకపోవడం, మరోవైపు ఆర్థిక ఇబ్బందులతో పాడి రైతులు చివరి పోరాటానికి సిద్ధమయ్యారు.

బకాయిల విడుదల డ్రామా

పాడిరైతులు మహాధర్నాకు పిలుపునివ్వడంతో ప్రభుత్వంలో కాస్త కదలిక వచ్చింది. రూ.50 కోట్ల బకాయిలు విడుదల చేసినట్టు విజయ డెయిరీ ప్రకటించింది. ఈ బిల్లులు మంగళవారం రైతుల ఖాతాల్లో జమవుతాయని తెలిపారు. బుధవారం కొందరికి రెండు బిల్లులు, ఇంకొందరికి ఒకే బిల్లు జమ చేయగా మరికొంత మందికి నయా పైసా ఇవ్వలేదు. అయితే ఇదంతా తమ ఆందోళనను ఆపేందుకు ప్రభుత్వం చేస్తున్న డ్రామాగా పాడి రైతులు అనుమానిస్తున్నారు. మొత్తం బకాయిలు చెల్లించేవరకు తమ పోరాటం ఆగదని, గురువారం నాటి ధర్నా యథావిధిగా కొనసాగుతుందని స్పష్టం చేస్తున్నారు.

కులవృత్తి మెడపై రేవంత్ సర్కార్ కత్తి

రాష్ట్రంలో కులవృత్తులపై రేవంత్‌రెడ్డి సర్కార్ కత్తికట్టిందని కేటీఆర్ విమర్శించారు. మత్తడి దుంకే చెరువుల్లో మత్స్య సంపద సృష్టించిన నీలి విప్లవాన్ని నీరుగారుస్తున్నారని విమర్శించారు. ఇప్పటిదాకా చేప పిల్లల పంపిణీ మొదలు కాలేదని, టెండర్ల దశ దాటనే లేదని, ఆ ప్రక్రియ ఉంటుందో, లేదో ఎవరికీ తెలియని గందరగోళం నెలకొన్నదని పేర్కొన్నారు.

కాంగ్రెస్ సర్కారువి బోగస్ మాటలు: కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో పాడి రైతులను కాంగ్రెస్ సర్కార్ పడావుపెట్టేలా దుర్మార్గంగా వ్యవహరిస్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. తమ పాల బిల్లులు ఇవ్వాలని రైతులు రోడ్డెక్కి నిరసన చేస్తే భయపడిన ప్రభుత్వం రూ .150 కోట్ల బకాయిల్లో కేవలం రూ. 50 కోట్లే విడుదల చేసి చేతులు దులుపుకొన్నదని మండిపడ్డారు. ఎత్తు కుర్చీల్లో కూర్చోవడం కాదని, కన్నెత్తి రైతుల గోస కూడా చూడాలని కోరారు. మాఫీ కానీ రుణమాఫీ, పత్తాలేని పాల బిల్లులు, భరోసాలేని రైతు భరోసా, బోనస్ పేరుతో బోగస్ మాటలు అని దుయ్యబట్టారు. బోగస్ హామీలతో రైతుల గొంతు నొక్కి గద్దెనెక్కి రాచరిక దర్పాన్ని ప్రదర్శిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

మంత్రుల అరాచకాలను ఎండగడతం

- అహంకారంతో విచ్చలవిడిగా అవినీతి
- నల్లగొండ పార్టీ నేతలతో కేటీఆర్ సమావేశం
- జగదీశ్‌రెడ్డి నివాసంలో కొనసాగిన భేటీ
- పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం

హైదరాబాద్, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన మంత్రుల అవినీతి, అరాచకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగడతామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు హెచ్చరించారు. అధికారం ఉందన్న అహంకారంతో జిల్లా మంత్రులు విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. బుధవారం ఉమ్మడి నల్లగొండ జిల్లా ముఖ్య నేతలతో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి నివాసంలో కేటీఆర్ సమావేశమయ్యారు. జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేయటంతోపాటు కార్యకర్తలకు భరోసా ఇచ్చేందుకు చేపట్టాల్సిన చర్యలు, కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నల్లగొండ జిల్లాలో మళ్లీ ఫ్లోరోసిస్ భూతం తెరపైకి వస్తున్నదంటూ పార్టీ నేతలు కేటీఆర్ దృష్టికి తీసుకొచ్చారు. కాంగ్రెస్ నేతల అరాచకాలు, అవినీతికి అడ్డు అదుపు లేకుండా పో యిందని వివరించారు. మంత్రుల ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేతలు ఏవిధంగా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారో నియోజకవర్గాలవారీగా కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్ని అంశా ల్లో అడ్డగోలుగా వ్యవహరిస్తుండటంతో వారిపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని చెప్పారు.

స్థానిక సమస్యలపై పోరాడుదాం

రాష్ట్ర రాజకీయాలతోపాటు నల్లగొండ జిల్లాకు సంబంధించిన స్థానిక అంశాలపై కూడా మరింత చురుగ్గా ప్రజాక్షేత్రంలోకి వెళ్లి పోరాడుదామని జిల్లా నేతలకు కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. జిల్లాలో లేవనెత్తాల్సిన సమస్యలను వారికి వివరించారు. త్వరలో జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో పర్యటించి కాంగ్రెస్ నేతల అరాచకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించారు. సమావేశంలో జగదీశ్‌రెడ్డితోపాటు మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు గ్యాదరి కిశోర్, గొంగిడి సునితా మహేందర్‌రెడ్డి, నోముల భగత్, రవీంద్రకుమార్, ఎన్ భాస్కర్ రావు, చిరుమర్తి లింగయ్య, పైళ్ల శేఖర్‌రెడ్డి, కంచర్ల భూపాల్‌రెడ్డి, బొల్లం మల్లయ్య, బిక్షమయ్యగౌడ్, ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, జడ్పీ మాజీ చైర్మన్లు సందీప్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, పలువురు పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా ముఖ్యనేతలతో చర్చిస్తున్న కేటీఆర్. చిత్రంలో జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, మాజీ చైర్మన్లు



తెలంగాణ భవన్‌లో హనుమకొండ నియోజకవర్గ నేతలతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు వినయ్‌భాస్కర్, యాదవరెడ్డి, కేతిరెడ్డి తదితరులు

పదిచోట్లా ఉప ఎన్నికలొస్తయ్

- ప్రజలే బుద్ధి చెప్తారు
- రేవంత్‌కి బీజేపీ రక్షణ కవచం
- చిట్టినాయుడు, బ్రదర్స్ రాష్ట్రాన్ని దోచేస్తున్నారు
- హనుమకొండ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): పార్టీ ఫిరాయింపులు జరిగిన పది అసెంబ్లీ నియోజకవర్గాల్లో బరాబర్ ఉప ఎన్నికలు వస్తాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు పునరుద్ఘాటించారు. ఆయా నియోజకవర్గాల్లో ఫిరాయింపుదారులకు ప్రజలే తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. బీఆర్ఎస్ పార్టీని మోసం చేసినవారికి బుద్ధిచెప్పాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నదని, మళ్లీ నాలుగేండ్లలో కేసీఆర్‌ను ముఖ్యమంత్రిగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. తెలంగాణభవన్‌లో బుధవారం హనుమకొండ నియోజకవర్గ కార్యకర్తలతో కేటీఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో పెద్దపదవులు అనుభవించిన కొందరు సిగ్గులేకుండా పార్టీని వీడిపోయారని, హైకోర్టు ఆర్డర్‌తో వారిలో భయం మొదలైందని పేర్కొన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఉపఎన్నిక వస్తదని, అక్కడ బీఆర్ఎస్ గెలుస్తదని, అక్కడి నుంచి రాజయ్యను ఇప్పటికే బీఆర్ఎస్ అభ్యర్థిగా కేసీఆర్ ప్రకటించారని గుర్తుచేశారు.

రేవంత్‌కు రక్షణ కవచంగా బీజేపీ

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బీజేపీ నేతలు రక్షణకవచంగా, అండగా నిలుస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ పథకమైన అమృత్ టెండర్లలో అవినీతి జరిగితే కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి నోరు మెదపడంలేదని, మరో మంత్రి బండి సంజయ్ గబ్బుగబ్బు మాట్లాడుతున్నారని, ఆ పార్టీ ఎంపీలు, నేతలు రేవంత్‌కు అనుకూలంగా వ్యాఖ్యలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వాన్ని నడుపుడంటే పంచ్ డైలాగులు కొట్టినంత ఈజీ కాదనే విషయం రేవంత్‌కు ఇప్పుడు అర్థమవుతున్నట్టు ఉన్నదని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో రేవంత్ పరిపాలన చూసిన తరువాత కేసీఆర్ మళ్లీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని కేటీఆర్ వివరించారు. ముఖ్యమంత్రి అమెరికా పర్యటనలో ఆయన సోదరుడే రూ.వెయ్యి కోట్ల ఒప్పందం కుదుర్చుకున్నాడని, ఆ వెయ్యికోట్లు ఎలా వచ్చాయో చెప్పాలని డిమాండ్ చేశారు. చిట్టినాయుడు, ఆయన అన్నదమ్ములు రాష్ట్రాని దోచుకుంటున్నారని, మంత్రులు ఎక్కడికక్కడ దోపిడీలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వరంగల్‌కు చేసింది చెప్పుకోలేకపోయాం. బీఆర్ఎస్ హయాంలో వరంగల్ నగరానికి రూ.వేల కోట్ల కేటాయించగా, కాంగ్రెస్ ప్రభుత్వం ఆయా అభివృద్ధి పనులను రద్దు చేస్తున్నదని కేటీఆర్ ధ్వజమెత్తారు. వరంగల్‌కు తెలంగాణలోనే అతి పెద్ద దవాఖాన, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, ఐటీ కంపెనీలను తీసుకొచ్చినా గత ఎన్నికల్లో సరిగ్గా చెప్పుకోలేకపోయామని పేర్కొన్నారు. ఎంజీఎం దవాఖాన పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయని, దీనిపై ఆందోళన చేయాలని పార్టీ నాయకులకు సూచించారు. వరంగల్‌ను ఐటీ హబ్ చేస్తామంటున్న కాంగ్రెస్ నేతలు దానిని గబ్బు చేయకుంటే చాలని ఎద్దేవా చేశారు. హైడ్రా డ్రామా వరంగల్‌లో కూడా మొదలవుతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ హామీల అమలు కోసం కమిటీలు వేసుకుందామని, ఆ బృందం షాడో గవర్నమెంట్ మాదిరిగా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు పనిచేస్తుందని కేటీఆర్ వివరించారు. సమావేశంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్ కే వాసుదేవరెడ్డి, డిప్యూటీ మేయర్ మసూద్, సుంచు కృష్ణ, వీరేందర్, నయీం, రాంబాబు, సారంగపాణి తదితరులుపాల్గొన్నారు.

వినయ్ భాస్కర్ మంత్రి అయితడు

దాస్యం వినయ్‌భాస్కర్ నిబద్ధత కలిగిన, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడని కేటీఆర్ కొనియాడారు. వినయ్‌భాస్కర్ భవిష్యత్‌లో తప్పకుండా మంత్రి అయితడని చెప్పారు. రాష్ట్రంలో చాలామంది బీఆర్ఎస్ వైపు చూస్తున్నారని, ఇంకో వందేండ్లు ఉండేవిధంగా పార్టీని బలోపేతం చేసుకుందామని పిలుపునిచ్చారు. పార్టీ నిర్మాణంపై దృష్టి సారించాలని దిశానిర్దేశం చేశారు. శాసనమండలిలో ప్రధాన ప్రతిపక్ష నేత ఎస్ మధుసూదనాచారి మాట్లాడుతూ కాంగ్రెస్ పాలన మాకొద్దు అంటూ ప్రజలు గగ్గోలు పెడుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ పతనం హనుమకొండ నుంచే ప్రారంభంకావాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ మాట్లాడుతూ అన్ని వర్గాలను అతి తక్కువ సమయంలోనే మోసం చేసిన ఘనత కాంగ్రెస్‌కు దక్కుతుందని పేర్కొన్నారు.



అమ్మమ్మ-తాతయ్యకు కేటీఆర్ ప్రేమతో..

జోగినపల్లి లక్ష్మి-కేశవరావు జ్ఞాపకార్థం స్కూల్ భవనం.. సొంత ఖర్చులతో నిర్మాణం.. నేడు ప్రారంభోత్సవం

బోయినపల్లి, సెప్టెంబర్ 25: రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం కొదురుపాక ఆర్అండ్ఆర్ కాలనీలోని జడ్పీ పాఠశాలలో ప్రైమరీ స్కూల్ కొనసాగేది. పక్కా భవనం లేకపోవడంతో ప్రాథమిక పాఠశాలలోని రెండు గదుల్లో అరకొర సౌకర్యాలతో విద్యాబోధన జరిగేది. విద్యార్థులు, ఉపాధ్యాయుల ఇబ్బందులను స్థానిక నాయకులు.. రెండేండ్ల క్రితం కొదురుపాక పాఠశాలకు వచ్చిన అప్పటి మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి తన అమ్మమ్మ, తాతయ్య జోగినపల్లి లక్ష్మి-కేశవరావు జ్ఞాపకార్థం సొంత ఖర్చులతో నూతన భవనం నిర్మిస్తానని హామీ ఇచ్చారు. 2022 జనవరి 10న ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. కేటీఆర్ సూచన మేరకు కార్పొరేట్‌కు దీటుగా అధునాతన సౌకర్యాలు కల్పించి రెండు ఫ్లోర్లలో 18 తరగతి గదుల నిర్మాణం చేపట్టారు. వంట గదితోపాటు డైనింగ్‌హాల్, కంప్యూటర్ గదులు, ప్రహరీ నిర్మాణాలు పూర్తి చేశారు. గురువారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేతులమీదుగా పాఠశాల భవనాన్ని ప్రారంభించనున్నారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బీఆర్ఎస్ రాష్ట్ర నేత జోగినపల్లి శ్రీనివాస్ హాజరుకానున్నారు.

దాడులు చేస్తూ కేసులు పెడితే సహించం

హైదరాబాద్, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): వికారాబాద్ నియోజకవర్గం మరుపల్లిలో బీఆర్ఎస్ కార్యకర్తలైన నవీన్, ప్రవీణ్ అనే ఇద్దరు దళితులపై స్థానిక ఎస్సై, పోలీసులు దాడి చేసిన ఘటనపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలు, నేతలపై దాడులు చేస్తున్నవారిని, అక్రమ కేసులు బనాయిస్తున్నవారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని హెచ్చరించారు. మరుపల్లిలో దాడికి గురైన దళితులతో కలిసి బుధవారం ఆయన తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారికి ధైర్యం చెప్పిన కేటీఆర్.. పార్టీ అండగా ఉంటుందని, లీగల్‌సెల్ ద్వారా న్యాయసాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. అవసరమైతే తాను కూడా వికారాబాద్‌కు వచ్చి ఆందోళన చేస్తానని ప్రకటించారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు, హ్యూమన్ రైట్స్ కమిషన్‌కూ ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఎస్సైలు, సీఐలు ఎక్స్‌ట్రాలు వేస్తే వారిని వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. మన మీద దాడులు చేస్తూ, తప్పుడు కేసులు బనాయిస్తున్నవారి పేర్లు రాసిపెట్టుకోవాలని సూచించారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక వారికి శంకరగిరి మాన్యాలు పటిస్తామని చెప్పారు.

స్పీకర్ స్పందించాలె...

తన సొంత నియోజకవర్గంలోనే దళిత బిడ్డలను పోలీసులు కొడుతుంటే స్పీకర్ పట్టించుకోకపోవటం విచారకరమని కేటీఆర్ పేర్కొన్నారు. దాడికి పాల్పడిన ఎస్సైపై చర్యలు తీసుకోవాలని స్పీకర్, డీజీపీతో మాట్లాడుతానని చెప్పారు. సమావేశంలో వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద పటేల్, మరుపల్లి మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ మధుకర్, ఎంపీపీ ఉపాధ్యక్షుడు మోహన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు భట్టు రమేశ్, అట్లూరి ఆశోక్, రాచన్న, కౌన్సిలర్ గో పాల్, అనంతరెడ్డి, వికారాబాద్ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మర్ చంద్రశేఖర్‌రెడ్డి, యువత అధ్యక్షుడు మధుకర్, నాయబ్‌గౌడ్ పాల్గొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మరుపల్లిలోనే కాదు రాష్ట్రవ్యాప్తంగా అరాచకాలకు పాల్పడుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. రాష్ట్ర ముఖ్యమంత్రే గూండా లెక్క మాట్లాడుతున్నారని, ఆయనను చూసి కాంగ్రెస్ కార్యకర్తలు కూడా గూండాల మాదిరిగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. కొంతమంది గూండాలను ఎస్కార్ట్ పెట్టి కౌశిక్‌రెడ్డి ఇంటిపైకి దాడికి పంపారని దుయ్యబట్టారు.

జ్యోతిప్రజ్వలన చేస్తున్న సినీనటి జయసుధ, డాక్టర్ ప్రీతిరెడ్డి తదితరులు

'మల్లారెడ్డి నారాయణ' లో రోబోటిక్ సర్జరీ సేవలు

ప్రారంభించిన సినీ నటి జయసుధ

దుండిగల్,సెప్టెంబర్ 25: సూరారంలోని మల్లారెడ్డి నారాయణ వైద్యశాలలో అత్యాధునిక రోబోటిక్ సర్జరీ సేవలను బుధవారం సినీనటి జయసుధ ప్రారంభించారు. ఈ సందర్భంగా జయసుధ మాట్లాడుతూ అతి తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో క్రిటికల్ స్టేజ్‌లో ఉన్న పేషెంట్లకు మెరుగైనచికిత్స అందించడమే లక్ష్యంగా రోబోటిక్ సర్జరీని అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. మల్లారెడ్డి నారాయణ, మల్లారెడ్డి హెల్త్‌సిటీ వైద్యశాలల చైర్మన్ సీహెచ్ భద్రారెడ్డి, వైస్ చైర్మన్ సీహెచ్ ప్రీతిరెడ్డి మాట్లాడుతూ మల్లారెడ్డి రోబోటిక్ శస్త్రచికిత్సలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) సేవలను వినియోగిస్తున్నట్టు తెలిపారు. సీనియర్ కన్సల్టెంట్, ఆర్థోపెడిక్ సర్జన్ అంజని కుమార్ మాట్లాడుతూ రోబోటిక్ యంత్రాల ద్వారా సూక్ష్మమైన, సంక్లిష్టమైన అంశాలను గుర్తించవచ్చని పేర్కొన్నారు.

బస్సు కోసం విద్యార్థుల రాస్తారోకో

పాఠశాలల సమయానికి అనుగుణంగా బస్సు నడిపించాలని డిమాండ్ చేస్తూ బుధవారం మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం ఖాజాపూర్‌లోని ప్రధాన రహదారిపై విద్యార్థులు రాస్తారోకో చేశారు. మండలంలోని ఖాజాపూర్, ఖాజాపూర్ తండా నుంచి అక్కన్నపేట, రామాయంపేట గ్రామాలకు రోజూ పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాఠశాలలకు వెళ్తుంటారు. ఉదయం పూట పాఠశాల సమయానికి బస్సు రాకపోవడంతో స్కూళ్లకు వెళ్లలేకపోతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే హామీతో రాస్తారోకో విరమించారు.